మెయిన్
టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ
సంపుటి : 8
సంచిక : 50
పేజీలు : 2
శనివారం 06 సెప్టెంబర్, 2025

పెట్టుబడుల సాధనకు సహకారమివ్వండి

- ప్రధాని మోదీని కోరిన మంత్రి లోకేశ్

టి మీడియా,సెప్టెంబర్ 5,ఢిల్లీ బ్యూరో :
ప్రధాని నరేంద్ర మోదీతో మంత్రి నారా లోకేశ్ భేటీ అయ్యారు. కేంద్ర సాయం, పెండింగ్ ప్రాజెక్టులు, కేంద్ర పథకాల అమలు, తాజా రాజకీయ పరిస్థితులపై ప్రధానితో లోకేశ్ చర్చించారు. సుమారు 45 నిమిషాల పాటు ఈ భేటీ సాగింది. ఈ క్రమంలో రాష్ట్రంలో పెట్టుబడుల ఆకర్షణకు సహకారం అందించాలని ప్రధానిని కోరారు. రాష్ట్రంలో సెమీ కండక్టర్ యూనిట్ మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అలానే రాష్ట్రంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమల స్థాపనకు సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత 15 నెలలుగా కేంద్రం సహకారంతో పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా అమలు చేస్తున్నామని తెలిపారు. జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలోని కోట్లాది పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపశమనం కలిగించిన ప్రధాని మోదీకి మంత్రి లోకేశ్ కృతజ్ఞతలు తెలిపారు.రాష్ట్రంలో గత కొంతకాలంగా నెలకొన్న వివిధ పరిణామాలను మోదీకి లోకేశ్ వివరించారు. దీనికి ప్రధాని స్పందిస్తూ రాష్ట్రాభివృద్ధికి అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు. అలానే యోగాంధ్ర నిర్వహణపై రూపొందించిన కాఫీ టేబుల్ బుక్‌ను ఈ సందర్భంగా మోదీకి లోకేశ్ బహుకరించారు. మే 17న తన సతీమణి నారా బ్రాహ్మణి, కుమారుడు దేవాంశ్‌లతో మోదీని కలిసిన లోకేశ్ 4 నెలల వ్యవధిలో మళ్లీ ప్రధానిని కలవడం విశేషం.

ధరణి దరిద్రాన్ని భూభారతితో తొలగింపు

భూమికి, తెలంగాణ ప్రజలకు విడదీయరానిబంధం

జీపీవోలకు నియామక పత్రాలు అందజేతలో సీఎం

టీ మీడియా , సెప్టెంబర్ 5,హైదరాబాద్ బ్యూరో :
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పోరాటాలు భూమి చుట్టూ తిరిగాయని, కొమురంభీమ్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్య, రావినారాయణరెడ్డి లాంటి మహానుభావులు భూమి కోసమే పోరాడారని సీఎం రేవంత్? రెడ్డి అన్నారు. భూమికి, తెలంగాణ ప్రజలకు విడదీయరాని అనుబంధం ఉందని, ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో రెవెన్యూశాఖ సిబ్బంది ఉవ్వెత్తున పాల్గొన్నారని పేర్కొన్నారు. రాష్ట్ర సాధనలో రెవెన్యూశాఖ సిబ్బంది కీలకపాత్ర పోషించారన్న సీఎం ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్‌శాఖ కార్మికుల పాత్ర కూడా మరువలేనిదని గుర్తుచేశారు. హైదరాబాద్?లోని హైటెక్స్? లో గ్రామ పాలన అధికారులకు నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో రేవంత్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. 5,106 మంది గ్రామ పాలన అధికారులుగా అర్హత సాధించారు.

వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థనే తొలగించారు

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న సిబ్బందికి గత సీఎం మేలు చేస్తారని అందరూ ఆశించారని, కానీ సిబ్బంది ఆత్మహత్య చేసుకున్నా పట్టించుకోలేదని

రేవంత్? రెడ్డి ఆక్షేపించారు. ప్రజలను దోచుకున్నది రెవెన్యూ ఉద్యోగులే అన్నట్లు గత ప్రభుత్వం చిత్రీకరించిందని విచారం వ్యక్తం చేశారు. ధన, భూదాహంతో భూమిని చెరబట్టాలని ధరణి అనే పోర్టల్?ను తీసుకొచ్చారని, భూముల వివరాలు ప్రజలకు తెలియకూడదని వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థనే తొలగించారని పేర్కొన్నారు.

ఎవరిని పలకరించినా ధరణి సమస్యలే

వీఆర్‌వో, వీఆర్‌ఏ వ్యవస్థను తొలగించకపోతే గత ప్రభుత్వ పెద్దల దుర్మార్గాలు తెలుస్తాయని భావించారని, వారి దోపిడీకి అడ్డుగా ఉన్నారని వీఆర్‌వో, వీఆర్‌ఏలను తొలగించారని తెలిపారు. ఎన్నికల ముందు ఎవరిని పలకరించినా ధరణి సమస్యలు విన్నవించేవారని, కాంగ్రెస్? పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ధరణిని బంగాళాఖాతంలో పడేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చామని, ధరణితో పట్టుకున్న దరిద్రాన్ని భూభారతితో తొలగించే ప్రయత్నం చేసినట్లు తెలిపారు. రెవెన్యూశాఖ కావాలని పొంగులేటి శ్రీనివాసరెడ్డి అడగలేదని ఆయన సమర్థత గుర్తించి ఇచ్చినట్లు సీఎం తెలిపారు.ప్రజలకు రెవెన్యూ అధికారుల వల్ల సమస్యలు రాలేదని, ప్రజలకు ధరణి అనే రెవెన్యూ పోర్టల్? వల్ల వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించాలంటే గ్రామ పరిపాలన అధికారులు అందుబాటులో ఉండాలని, సాదాబైనామాల సమస్యలను జీపీవోలు పరిష్కరించాలని ఆయన సూచించారు. ఎంత మంచి వ్యవస్థ అయినా 5 శాతం తప్పులు జరుగుతాయని, ఏదైనా తప్పు జరిగితే వ్యవస్థను మొత్తం రద్దు చేస్తామా? అని ప్రశ్నించారు. ఇంట్లో ఎలుక దూరితే దానిని చంపేయాలి తప్ప, ఇళ్లను తగలబెడతామా అని అన్నారు.జీపీవోల చేతుల్లోనే ఉంది : రెవెన్యూ ఉద్యోగులే దుర్మార్గులు అనేలా గత బీఆర్ఎస్? ప్రభుత్వం చిత్రీకరించిందని, వ్యవస్థలో ఏదో చిన్న తప్పులు జరిగాయని రద్దు చేశారని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మూడేళ్లకు కూలిపోయిందని, మరి వాళ్లను రద్దు చేస్తారా? విమర్శలు గుప్పించారు. చెడ్డపేరు రాకుండా గ్రామపాలన అధికారులు పనిచేయాలని సూచించిన సీఎం జీపీవోలు సక్రమంగా పనిచేస్తారని కేబినెట్‌కు హామీ ఇచ్చానని తెలిపారు. భూమి మీద ఆధిపత్యం చెలాయించాలనుకోవడం అసాధ్యమని, నిజాంలకు ఏవిధంగా గుణపాఠం చెప్పారో ప్రజలు గత ప్రభుత్వ పాలకులకు అలాంటి గుణపాఠమే చెప్పారని అభిప్రాయపడ్డారు. రెవెన్యూశాఖపై పడిన మచ్చను తొలగించుకునే అవకాశం జీపీవోల చేతుల్లోనే ఉందని వెల్లడించారు.

నిత్య విద్యార్థిని

- సీఎం చంద్రబాబు

టీ మీడియా , సెప్టెంబర్ 5,విజయవాడ :
పిల్లల్లో విజ్ఞాన జ్యోతులు వెలిగిస్తున్న వారందరికీ సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. విజయవాడ ఏ కన్వెన్షన్‌లో గురుపూజోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, సత్యకుమార్ యాదవ్?లతోపాటు ఇతర నేతలు పాల్గొన్నారు. విద్యాశాఖ ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్ బెస్ట్ ప్రాక్టీసెస్ విధానాలను సీఎం పరిశీలించారు. పోటీ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలని మంత్రి లోకేశ్?కు సీఎం సూచించారు. విద్యార్థులు జాతీయ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు సాధించేలా తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. ఎన్?ఐఆర్?ఎఫ్? ర్యాంకింగ్‌లో ఆంధ్ర వర్శిటీకి 4వ ర్యాంకు రావడం శుభపరిణామమని, ఇలాంటి ర్యాంకులు మరిన్ని రావాలని ఆకాంక్షించారు. అలానే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ సందర్భంగా నెలకొల్పిన గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్?ను నిర్వాహకులు ముఖ్యమంత్రికి అందించారు.గురుపూజోత్సవం చాలా పవిత్రమైన కార్యక్రమమని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. తల్లిదండ్రుల తర్వాత మనం గుర్తు పెట్టుకునేది ఉపాధ్యాయులనే అని, అలాంటి వారిని జీవితంలో ఎప్పుడూ మరిచిపోలేమని అన్నారు. విద్యార్థి దశలో పిల్లల్లో స్ఫూర్తిని కలిగించేది, అలానే మనలో ఉన్న నైపుణ్యాన్ని గుర్తించి బయటకు తీసేది గురువేనని తెలిపారు. భక్తవత్సలం అనే ఉపాధ్యాయుడు నా జీవితంలో స్ఫూర్తి నింపారని, నేను నిత్య విద్యార్థిని ప్రతిరోజు ఏదో ఒకటి నేర్చుకుంటానని సీఎం వివరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం మనకు ఆదర్శప్రాయమని చెప్పారు. రాధాకృష్ణన్ రేణిగుంట పాఠశాలలో టీచర్‌గా, ఏయూలో ఆచార్యుడిగా పని చేశారని అన్నారు.గత ఏడాది బుడమేరు వరదల కారణంగా గురుపూజోత్సవం జరుపుకోలేక పోయామని ఆవేదన వ్యక్తం చేసారు. 175 మంది ఉపాధ్యాయులు ఇచ్చిన సూచన, సలహాలతో వారి ఫొటోలతో పుస్తకాన్ని ముద్రిస్తామని వెల్లడించారు. సాధారణంగా రాజకీయ నాయకుల పిల్లలు చదువుకోరు కాని మా ఇంట్లో లోకేశ్? చదువు గురించి నా భార్య భువనేశ్వరి చూసేవారని ఈ విషయంలో ఆ క్రెడిట్ ఆవిడదేనని సీఎం అన్నారు.విద్యను రాజకీయాలకు దూరంగా ఉంచాం: గురువులు చూపించిన దారిలో నడవడం వల్లే తాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదువుకోగలిగానని మంత్రి నారా లోకేశ్ అన్నారు. పిల్లల జీవితాలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని, విద్యాశాఖలో ఏడాదిలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామని తెలిపారు. అందరం కలిసి కట్టుగా ఆంధ్రా మోడల్ విద్యా వ్యవస్థను ప్రపంచానికి చాటుదామని మంత్రి స్పష్టం చేశారు. చదువు ఒక వ్యక్తిని పేదరికం నుండి బయటకి తీసుకొస్తుందనటానికి ప్రత్యక్ష ఉదాహరణ ఏపీజే అబ్దుల్ కలాం అని తెలిపారు. గురువులే చూపించిన దారే నన్ను స్థాయిలో నిలబెట్టిందని గుర్తు చేసుకున్నారు. మంత్రి నారాయణ తనకు బ్రిడ్జ్ కోర్స్ నేర్పించిన తీరు తన జీవితాన్ని మార్చేసిందని తెలిపారు. చదువు కోసం ఇంటి నుండి బయట ఉన్నప్పుడు సమాజం గురించి తెలిసిందన్నారు.

- నిమజ్జనం వేళ ఉగ్రవాదుల బెదిరింపు
- హై అలెర్ట్ ప్రకటించిన ముంబయి పోలీసులు

టి మీడియా,సెప్టెంబర్ 5,ముంబయి :
వినాయక నిమజ్జనానికి ముందు ముంబయిలో మానవ బాంబులు ప్రవేశించారంటూ బెదిరింపు మెయిల్ రావటంతో పోలీసులు హై అలెర్ట్ ప్రకటించారు. ఈ మేరకు

కోటి మందిని చంపుతాం

ముంబయి ట్రాఫిక్ కంట్రోల్ రూముకు బెదిరింపు మెయిల్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. మహా నగరంలో 14మంది ఉగ్రవాదులు చొరబడ్డారని, 34వాహనాల్లో మానవ బాంబులు వేర్వేరు ప్రాంతాల్లో సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నట్లు చెప్పారు. 400కిలోల ఆర్డీఎక్స్‌తో పేలుళ్లు జరపనున్నట్లు బెదిరింపు మెయిల్ సారాంశమన్నారు. ఆర్డీఎక్స్‌తో కోటి మందిని చంపుతామని దుండగులు మెసేజ్?లో బెదిరించినట్లు చెప్పారు.ఈ-మెయిల్ 'లష్కర్-ఏ-జిహాదీ' అనే వాట్సాప్ ఖాతా నుంచి వచ్చినట్లు గుర్తించారు. పాకిస్థాన్‌కు చెందిన జిహాదీ గ్రూప్ సభ్యుడినంటూ మెయిల్ పంపిన వ్యక్తి పేర్కొన్నట్లు అధికారులు చెప్పారు. దీంతో హై అలర్ట్ ప్రకటించిన పోలీసులు ముంబయి మహానగరంలో బాంబు నిర్వీర్య బృందాలు, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు చేపట్టారు. ఇప్పటివరకు ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలను

మిగతా 2లో..

తెలంగాణకు నూతన విద్యావిధానం

జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులే

- గురుపూజోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి



టీ మీడియా , సెప్టెంబర్ 5,హైదరాబాద్ బ్యూరో :
తెలంగాణకు నూతన విద్యావిధానం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యాశాఖ అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, ఎన్నో సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందని తెలిపారు. హైదరాబాద్?లోని మాదాపూర్ శిల్పకళావేదికలో గురుపూజోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గురుపూజోత్సవ కార్యక్రమానికి రావడం సంతోషంగా ఉందని, తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయులు క్రియాశీలక పాత్ర పోషించారని, ప్రతిగ్రామానికి జై తెలంగాణ నినాదాన్ని చేరవేసింది ఉపాధ్యాయులేనని చెప్పారు. ఆనాడు జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించేలా చేశారని, తెలంగామ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు తమ సమస్యలు ఏ విధంగా పరిష్కరించుకున్నారో ఆలోచించుకోవాలని ప్రశ్నించారు? ప్రభుత్వ పాఠశాలల్లోనూ నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు బోధిస్తున్నామని, ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకంటే నాణ్యమైన విద్య అందిస్తామని ప్రతిజ్ఞ చేద్దామని సీఎం రేవంత్? రెడ్డి చెప్పారు. ఏటా 200 మంది టీచర్లను విదేశాలకు పంపి అక్కడి విద్యావిధానం అధ్యయనం చేసేలా ప్రోత్సహిస్తామని ప్రకటించారు. దిల్లీలో కేజ్రీవాల్ రెండోసారి సీఎం కావడానికి ఆయన చేసిన విద్యాభివృద్ధే కారణమన్న ఆయన తనకూ స్వార్థం ఉందని టీచర్లు బాగా పనిచేస్తే రెండోసారి సీఎం అవ్వాలనుకుంటున్నట్లు తెలిపారు.

అందరం కలిసి కష్టపడదాం

టీచర్లే కష్టపడితే తాను సీఎం అవుతా అనట్లేదని, మీతో పాటే తాను కష్టపడతానని ముఖ్యమంత్రి రేవంత్? రెడ్డి అన్నారు. తాను ఫామ్‌హౌస్‌లో పడుకుంటా మళ్లీ సీఎంను చేయండి అనట్లేదని పరోక్షంగా విమర్శలు చేశారు. విద్యాభివృద్ధి కోసం టీచర్లు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వస్తానని వెల్లడించారు. ఐటీఐలు అప్‌గ్రేడ్ చేసి అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా మార్చామని, ఏటీసీలో టాటా కంపెనీ కల్పించిన సదుపాయాలు చూస్తే తనకే మతిపోతుందని సీఎం అన్నారు. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారత్ ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణం సాధించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.దక్షిణ కొరియాలో ఒక్క యూనివర్సిటీనే 16 స్వర్ణ పతకాలు సాధించిందని రేవంత్? రెడ్డి అన్నారు. మట్టిలో మాణిక్యాలను వెలికితీయండని వారికి ప్రభుత్వమే అన్ని సదుపాయాలు కల్పిస్తుందని తెలిపారు. చదివితేనే భవిష్యత్ కాదని క్రీడల్లో రాణించినా భవిష్యత్ ఉంటుందని అన్నారు. క్రీడల్లో రాణించిన క్రికెటర్ సిరాజ్, బాక్సర్ నిఖత్ జరీన్ డీఎస్పీలుగా ప్రస్తుతం ఉన్నారని ప్రశంసించారు. ఇంజినీరింగ్ విద్యార్థులు గంజాయి పెడ్లర్‌గా మారుతున్నారని, డ్రగ్స్ వ్యసనాలు చిన్న మండలాలకు వ్యాపించిందని అన్నారు. పిల్లలను తల్లిదండ్రులు నిశితంగా పరిశీలించాలని సూచించారు. గంజాయి, డ్రగ్స్ నిర్మూలనకు ఈగల్ ఫోర్స్ తీసుకొచ్చినట్లు తెలిపారు.

మూతపడే పరిస్థితికి ఓయూ

చాలా చోట్ల కేజీ టూ పీజీ వరకు ఉచిత విద్య అందడం లేదని, విద్యార్థులకు గత ప్రభుత్వం సరైన ఆహారం అందించలేదని సీఎం రేవంత్?రెడ్డి ఆక్షేపించారు. విద్యారంగాన్ని గత ప్రభుత్వం వ్యాపారంగా మార్చుకుందని, కొత్త నియామకాలను గత ప్రభుత్వం నియమించలేదని, గొప్ప చరిత్ర కలిగిన ఉస్మానియా వర్సిటీ మూతపడే పరిస్థితికి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.తాను ప్రభుత్వ పాఠశాలలో చదువుకొనే ఈ స్థాయికి వచ్చానన్న సీఎం రేవంత్? గతంలో గురుపూజోత్సవం ఎప్పుడైనా జరిగిందా? అందులో ముఖ్యమంత్రి పాల్గొన్నారా? అని ప్రశ్నించారు. తెలంగాణ పునర్నిర్మాణంలో టీచర్ల సహకారం కావాలని, పిల్లలు ఎక్కువ సమయం వారి వద్దే ఉంటారని అన్నారు. పిల్లలతో కలిసే టీచర్లు మధ్యాహ్న భోజనం చేయాలని సూచించారు.

3 లక్షల మంది విద్యార్థులు కొత్తగా : గత ప్రభుత్వానికి వర్సిటీలకు వీసీలను నియమించడానికి తీరిక కూడా లేదని, దానిలో కూడా రాజకీయాలు చేసిందని సీఎం

మిగతా 2లో..

శిల్పాశెట్టి దంపతులపై లుకౌట్ నోటీసు

- దేశం విడిచివెళ్లకుండా నిఘా
- రూ.60కోట్ల ఆర్థిక నేరం కేసు

టి మీడియా,సెప్టెంబర్ 5,ముంబయి :
బాలీవుడ్ నటి శిల్పాశెట్టితోపాటు ఆమె భర్త, వ్యాపారవేత్త రాజ్‌కుంద్రాపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. 60 కోట్ల రూపాయల ఆర్థిక మోసానికి సంబంధించిన చీటింగ్ కేసులో ముంబయి పోలీసు శాఖకు చెందిన ఆర్థిక నేరాల విభాగం వారిపై లుకౌట్ నోటీసులు జారీ చేసింది. శిల్పాశెట్టి దంపతులు తరచూ అంతర్జాతీయ పర్యటనలు చేపడుతున్నట్లు గుర్తించామని పోలీసులు తెలిపారు. 60 కోట్ల రుణం, పెట్టుబడులకు సంబంధించి ఆర్థిక ఒప్పందం చేసుకున్న ఒక వ్యాపారవేత్తను శిల్పా దంపతులు మోసం చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. దీనిపై ఆగస్టు 14న జుహూ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైందని వివరించారు. నిందితులు దేశం విడిచివెళ్లకుండా వారిపై నిఘా ఉంచడం కోసం లుకౌట్ నోటీసులు జారీ చేస్తారు. ఫలితంగా ఇమ్మిగ్రేషన్, సరిహద్దు నియంత్రణ పాయింట్ల వద్ద అధికారులు నిందితులను అదుపులోకి తీసుకునే వీలుంటుంది.

ఇదీ కేసు

చెందిన దీపక్ కొఠారీ అనే వ్యాపారవేత్త నటి శిల్పా శెట్టి, రాజ్? కుంద్రాపై తీవ్ర ఆరోపణలు చేశారు. 2015లో రాజేశ్? ఆర్య అనే వ్యక్తి? ద్వారా శెట్టి- కుంద్రాతో తనకు పరిచయం ఏర్పడిందని దీపక్? ఫిర్యాదులో చెప్పారు. అప్పుడు వీరు ఆన్?లైన్? షాపింగ్? ప్లాట్?ఫామ్? అయిన బెస్ట్? డీల్? టీవీకి డైరెక్టర్లుగా ఉన్నారని, అప్పటికి ఆ కంపెనీలో 87 శాతం కంటే ఎక్కువ వాటా ఉందని పేర్కొన్నారు. అయితే 2015-2023 మధ్య

కాలంలో వ్యాపార విస్తరణ కోసం దీపక్? వీరికి రూ. 60.48 కోట్లు ఇవ్వగా, ఆ నిధులను శెట్టి తన వ్యక్తిగతంగా ఖర్చు చేశారని వాపోయారు.

డబ్బును సకాలంలో తిరిగి ఇస్తామన్న శెట్టి

2015 ఏప్రిల్?లో మొదటి విడతగా రూ. 31.95 కోట్లు ఇచ్చానని ఫిర్యాదులో పేర్కొన్నారు. 2015 జులై, 2016 మార్చి మధ్య రూ. 28.54 కోట్లు అదనంగా బదిలీ చేశానని చెప్పారు. అలా మొత్తంగా రూ. 60.48 కోట్లుకు పైగా బదిలీ చేశానని చెప్పుకొచ్చారు. ఓ సమావేశం నిర్వహించి డబ్బును సకాలంలో తిరిగి ఇస్తామని శెట్టి హామీ ఇవ్వడంతో ఒప్పందం కుదిరినట్లు దీపక్ వివరించారు. కానీ నెల తర్వాత సెప్టెంబర్?లో శెట్టి కంపెనీ డైరెక్టర్? పదవికి రాజీనామా చేశారని తెలిపారు. ఆ తర్వాత ఆ కంపెనీపై రూ. 1.28 కోట్ల దివాలా కేసు బయటపడిందని, ఈ విషయాన్ని బయటకి చెప్పలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

రెస్టరెంట్‌ను మూసివేస్తున్నట్లు శిల్పాశెట్టి ప్రకటన

అంతకుముందు రెండు రోజుల క్రితమే ముంబయి బాంద్రాలో ఉన్న పెద్ద రెస్టరంట్‌లలో ఒకటైన బాస్టియన్‌ను మూసివేస్తున్నట్లు శిల్పాశెట్టి సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ఈ విషయం వైరల్‌గా మారడంతో నెట్టింట అనేక కథనాలు వెలువడ్డాయి. దీంతో స్పందించిన ఆమె, దీన్ని పూర్తిగా మూసివేస్తామనే ప్రచారంలో నిజం లేదన్నారు. దీనిని అక్టోబర్‌లో జుహులో ప్రారంభిస్తామని వివరణ ఇచ్చారు. తాజాగా దీనిపై ఆమె క్లారిటీ ఇవ్వడంతో దీనికి ఫుల్‌స్టాప్ పడింది. సినిమాల్లో బిజీగా ఉన్న సమయంలోనే శిల్పా శెట్టి వ్యాపార రంగంలోకి అడుగుపెట్టి బాస్టియన్ పేరుతో రెస్టరంట్‌ను ప్రారంభించారు. ముంబయి నగరంలోని పలు ప్రాంతాల్లో దీనికి ఆరు బ్రాంచ్‌లు ఉన్నాయి.

తెలంగాణ గవర్నర్ కుమారుడి అరెస్టు

త్రిపుర ఎమ్మెల్యేను బెదిరించినట్లు ఫిర్యాదు

టి మీడియా, సెప్టెంబర్ 5,అగర్తల:
టిప్రా మోత ఎమ్మెల్యే ఫిలిప్ కుమార్ రియాంగ్‌ను బెదిరించిన కేసులో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ కుమారుడితోసహా నలుగురు వ్యక్తులను త్రిపుర పోలీసులు ఈనెల 2న అరెస్టు చేశారు. అగర్తలలోని ఐఎల్ఎస్ దవాఖాన సమీపంలో ఉన్న ఎమ్మెల్యే హాస్టల్ వద్ద ప్రభుత్వ నివాసంలో ఈ బెదిరింపులు చోటుచేసుకోవడంతో రియాంగ్ తన సహచర ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తలదాచుకున్నారు.సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో తన 209 నంబర్ ప్రభుత్వ క్వార్టర్‌లో ఓ ప్రైవేట్ సంభాషణ జరుగుతున్న సమయంలో మద్యం మత్తులో ఉన్న వీరు తనను, తన కుటుంబాన్ని చంపివేస్తామని బెదిరించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో రియాంగ్ ఆరోపించారు.

ప్లాస్టిక్ బాటిళ్లతో పడవ తయారీ

విపత్తులు, ప్రభుత్వ కార్యక్రమాల్లో వినియోగం

టి మీడియా, సెప్టెంబర్ 5,రంగారెడ్డి :

ప్రస్తుతం ప్రపంచంలో ప్లాస్టిక్? వాడకం అందరి జీవితంలో ఒక భాగమైపోయింది. మనం వాడేసి పారేసే ప్లాస్టిక్ బాటిళ్లు, బ్యాగులు భూమిపైన, సముద్రాల్లో పేరుకుపోయి పర్యావరణ కాలుష్యానికి ప్రధాన కారణమవుతున్నాయి. దీనిని తగ్గించడానికి ప్లాస్టిక్ పునర్వినియోగం చేయడం ఒకటే దారి. దీనివల్ల కొత్త ప్లాస్టిక్? ఉత్పత్తికి అవసరమైన శక్తి ఆదా అవుతుంది. అంతేకాకుండా ఈ వ్యర్థాలు భూమిపైన పేరుకుపోకుండా తగ్గించవచ్చు.అయితే ఇప్పటివరకు మనం వాడిపడేసే ప్లాస్టిక్ బాటిళ్లతో అనేక ఆవిష్కరణలు చేయవచ్చని విన్నాం. పలుమార్లు చేసినవి చూశాం. కానీ రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ పురపాలక సిబ్బంది బాటిళ్లతో ఏకంగా ఓ చిన్నపాటి పడవను తయారు చేసి వివిధ పనులకు వాడుతున్నారు. ఏటా భూమిపై పేరుకుపోతున్న ప్లాస్టిక్ పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఓ మంచి కార్యాక్రమానికి నడుం బిగించి అబ్బురపరుస్తున్నారు.

ప్లాస్టిక్ బాటిళ్లతో పడవ తయారీ

ప్లాస్టిక్ పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు వినూత్న ఆలోచనతో అక్కడి అధికారులు కదం తొక్కారు. వాడిపడేసిన ప్లాస్టిక్ బాటిళ్లను ఒక కూర్పుగా చేసి, వాటితో ఏకంగా ఓ చిన్నపాటి పడవను తయారు చేశారు. అంతేకాక దానిని వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారు. రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్ పురపాలక సంఘ

అధికారులు, సిబ్బంది 100 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా సంయుక్తంగా ఆ పడవను రూపొందించినట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతలో పురపాలికను అగ్రస్థానాన నిలపడమే కాకుండా ప్రజలకు ప్లాస్టిక్‌పై మరింత అవగాహన కల్పించడమే తమ ధ్యేయమని అధికారులు వివరించారు.

ప్రజల్లో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించేందుకు

నిరుపయోగమైన ప్లాస్టిక్ బాటిళ్లతో తయారు చేసిన ఆ పడవను వినాయక నిమజ్జన వేడుకలు, వరదల సమయంలో ఉపయోగపడేలా రూపకల్పన చేశారు. వాడేసిన ట్యూబులు, కర్రలు వంటి వస్తువులతో నిత్య జీవితంలో ఉపయోగపడే పడవను రూపొందించడం ఆనందకరమన్నారు. ప్లాస్టిక్ పునర్వినియోగంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఇదో మంచి ప్రయత్నమని అభిప్రాయపడ్డారు. ప్రజలు, పర్యావరణం కోసం వినూత్న ఆలోచనలు చేసి, వాటిని అమలులోకి తీసుకురావడంలో తుర్కయాంజాల్ పురపాలక సిబ్బంది మంచి ఉదాహరణగా నిలిచారని స్థానికులు కొనియాడారు.ఇప్పుడు వినియోగిస్తున్న ప్లాస్టిక్? అనర్థాల వల్ల ఎన్నో నష్టాలు సంభవిస్తున్నాయి. రోజువారీ ఉత్పత్తి అయ్యే ప్లాస్టిక్? వ్యర్థాల పరిమాణం రోజురోజుకూ పెరుగుతోంది. దానిలో సగానికిపైగా ఆ వ్యర్థాలు భూమిలోనే కలుస్తోంది. దీని వల్ల నాలాలు, చెరువులు, ఖాళీ స్థలాలను ప్లాస్టిక్? మహమ్మారి ముంచేస్తోంది. ఈ వ్యర్థాల వల్ల వాతావరణాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి.

ఇలా చేస్తే వ్యర్థాల నివారించే అవకాశం

మనిషి తలచుకుంటే ప్లాస్టిక్? ఉపయోగాన్ని వీలైనంత వరకు తగ్గించవచ్చు. ఇలా చేయడం వల్ల పర్యావరణాన్ని కాపాడుకోవడం అసాధ్యమేమీ కాదు. దీని కోసం పెద్దగా శ్రమించాల్సిన పనేమీ లేదు. రోజు వారీ జీవితంలో కొన్ని చిన్న చిన్న మార్పులు చేసుకుంటే సరిపోతుంది. అవేంటో ఇప్పుడు చూద్దాం.నీరు తాగడం కోసం మట్టి, గాజు, పింగాణీ, స్టీలు గ్లాసులు వాడితే ఉత్తమం. అలాగే నీటిని తీసుకువెళ్లడానికి ప్లాస్టిక్? బాటిళ్లకు బదులుగా రాగి బాటిళ్లను వినియోగించవచ్చు. టీ, కాఫీ తాగేందుకూ స్టీలు గ్లాసులు, కప్పులను వినియోగించడం వల్ల ప్లాస్టిక్? వినియోగాన్ని సాధ్యమైనంత వరకు నివారించవచ్చు.

నీకు ఎంత ధైర్యం..?

ఐపీఎస్ అధికారినికి అజిత్ పవార్ బెదిరింపులు

టి మీడియా, సెప్టెంబర్ 5, ముంబై:

మహారాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి అజిత్ పవార్ వివాదంలో చిక్కుకున్నారు. అక్రమ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టిన ఓ మహిళా ఐపీఎస్ అధికారిణి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారు. 'నీకు ఎంత ధైర్యం..?' అంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణ ప్రస్తుతం వైరల్‌గా మారింది.సోలాపుర్ లోని కుర్దూ గ్రామంలో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్లు ఐపీఎస్ అధికారిణి అంజనా కృష్ణకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆమె రంగంలోకి దిగారు. రెండు రోజుల క్రితం ఆ గ్రామాన్ని సందర్శించారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న వారిని అడ్డుకున్నారు. ఇంతలో పలువురు ఎన్‌సీపీ నేతలు అక్కడికి చేరుకని అంజనా కృష్ణను అడ్డుకున్నారు. అందులో ఒకరు డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌కు ఫోన్ చేసి మాట్లాడారు. ఈ క్రమంలో ఫోన్‌ను సదరు అధికారిణికి ఇవ్వాలని అజిత్ సూచించగా.. అంజనా కృష్ణ ఫోన్‌లో మాట్లాడారు.నేను డిప్యూటీ సీఎం అజిత్ పవార్‌ను మాట్లాడుతున్నాను. మీ చర్యలను వెంటనే ఆపి అక్కడి నుంచి వెళ్లిపోండి' అని అన్నారు. అయితే, అజిత్ పవార్ వాయిస్‌ను గుర్తుపట్టని అంజనా కృష్ణ.. ఫోన్‌లో నేను మాట్లాడుతోంది నిజంగా డిప్యూటీ సీఎంతోనేనా..? అంటూ ప్రశ్నించారు. ఈ విషయం తెలుసుకునేందుకు తన నంబర్‌కు వీడియో కాల్ చేయాలంటూ సూచించారు. ఆమె మాటలకు ఆగ్రహించిన డిప్యూటీ సీఎం 'నీకు ఎంత ధైర్యం..? నేను మీపై చర్యలు తీసుకుంటా. నన్నే వీడియో కాల్ చేయమంటారా..?' అంటూ మండిపడ్డారు. తనకు వాట్సాప్‌లో వీడియో కాల్ చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. దీంతో ఆమె వాట్సాప్‌లో వీడియో కాల్ చేసి డిప్యూటీ సీఎంతో మాట్లాడారు. అక్కడే ఉన్న కొందరు వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా.. ప్రస్తుతం అదికాస్తా వైరల్‌గా మారి వివాదానికి కారణమైంది.

అత్యాధునిక వైద్య సేవలు క్లిష్టమైన ఆపరేషన్లు

- అందిస్తున్న పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి
- సూపరింటెండెంట్ డా. కె.శ్రీధర్

టీ మీడియా,సెప్టెంబర్ 5, పెద్దపల్లి:



గోపయ్య పల్లి గ్రామానికి చెందిన దుర్గం మహేందర్ అనే ప్లంబర్ కార్మికుడు ప్లంబింగ్ పని చేస్తూ కట్టర్ వల్ల అతని ఎడమ పాదం తెగిపోయి,లోపల నరాలు కూడా తెగి మొత్తం పాదం నుజ్జు నుజ్జు అవడం జరిగింది.వెంటనే అతనిని పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది.ఇలాంటి గాయం చాలా జటిలము శస్త్ర చికిత్స చేయడం కూడా చాలా రిస్క్ తో కూడుకున్నది.అయినప్పటికి ఎముకల వైద్య నిపుణులు అయినా డా.కె.శ్రీనివాస్ రెడ్డి త్వరగా స్పందించి ఆ పేషెంట్ కు తెగిన నరాలను అతికించి,విరిగిన ఎముకలను కూడా అతికించడం జరిగింది.ఇలాంటి అరుదైన,కష్టమైన ఆపరేషను మన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేయడం జరిగింది.కావున పెద్దపల్లి ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రిలోని సేవలను వినియోగించుకోవాలి అని అస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.కె. శ్రీధర్ తెలిపారు అలాగే అరుదైన శస్త్ర చికిత్స చేసిన డా.కె.శ్రీనివాస్ రెడ్డి మరియు డా.కృష్ణ వేణిల వైద్య బృందాన్ని అభినందించడము జరిగింది.అలాగే ఈ విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎమ్మెల్యే సిహెచ్.విజయరమణ రావు కూడా వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించడం జరిగిందని తెలిపారు.

పల్లె నిద్ర నిర్వహించిన భాజపా నాయకులు

టి మీడియా,సెప్టెంబర్, 5,ఎండపల్లి :

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్ రాంచందర్ రావుఆదేశాలమేరకు,జగిత్యాల జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబు సూచనల మేరకు మండలంలోని గోడిసెలపేట గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఇన్చార్జి గాకస్తూరి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్థులను మర్యాదపూర్వకంగా కలిసిప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించి,విశ్వకర్మ లబ్ధిదారులను కలిసి రాబోయే జెడ్పిటిసి ఎంపీటీసీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు జనతా పార్టీకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలనిప్రతి ఒక్కరు వివిధ సంక్షేమ పథకాలను పొందాలని స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఒక్కరు పోటీ చేయాలనీ సూచించారు.ఈ కార్యక్రమంలో ధర్మపురి అసెంబ్లీ కన్వీనర్ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కొమ్ము రాంబాబు,ఎన్నికల ఇన్చార్జి మేడవేణి శ్రీనివాస్,మండల అధ్యక్షులు రావు హన్మంత రావు,మండల కార్యదర్శి మామిడిపల్లి రమేష్ బూత్ అధ్యక్షులు నాగుల మల్లేశం,గంగాధరి రవి, కిసాన్ మోర్చా అధ్యక్షులు రమేష్ బీజేవైఎం కార్యదర్శి నవీన్, మండల కోశాధికారి సబ్బు సంతోష్,బిజెపి సీనియర్ నాయకులు ఏలేటి భాస్కర్ రెడ్డి,గోపు లక్ష్మణ్,గోపు కేశవ్ బొద్దుల నాగరాజ్ భోగ సురేష్ నాగులశివ,అర్జున్,మనోజ్ ,అంజి బజరంగ్ దళ్ కార్యకర్తలు,యూత్ సభ్యులు, కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు.

నిమజ్జనానికి గణపయ్య ముస్తబయి

టి మీడియా,సెప్టెంబర్ 5,ఎండపల్లి:

శ్రీ వెంకటేశ్వరస్వామి భజన మండలి ఆధ్వర్యంలో మండలకేంద్రంలో వినాయకుడి శోభయాత్ర ఘనంఘా నిర్వహించారు. శోభ యాత్రలో భాగంగా యువకులు, పిల్లలు పెద్దలు భారి సంఖ్యలో పాల్గొని వాయిద్యాలతో పాటలతో నృత్యాలతో గ్రామంలోని అన్ని విధుల గుండా శోభ యాత్రనునిర్వహించారు..ఈ కార్యక్రమలో బొంగాని అంకయ్య తోడేటి గంగయ్య తోడేటి మల్లయ్య గుర్రం శంకరయ్య బొంగాని తిరుపతి, బొంగాని శ్రీనివాస్, బొంగాని తిరుపతి,రామగిరి అంజయ్య, ఆకుల నరసయ్య,తోడేటి కొమురయ్య,సీతమల్లయ్య, రాజు,గుర్రం చందు కాల్వ రమేష్ ఉజ్జల శివ గుర్రం చంద్రయ్య మడప బ్రహ్మయ్య తోడేటి కుమారు,డి తిరుపతి, భక్తులు పాల్గొన్నారు.

పీజే జ్యువెలర్స్ దినదినాభివృద్ధి చెందాలి

- ఎమ్మెల్యేకెపి వివేకానంద్

టీ మీడియా, సెప్టెంబర్ 5,మేడ్చల్:

కొంపల్లి జాతీయ రహదారిలో నూతనంగా ఏర్పాటుచేసిన "పీజే జ్యువెలర్స్" ను బిఆర్ఎస్ ఎల్పీ విప్,ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆధునిక డిజైన్లతో అతివలతో పాటు అందరినీ ఆకట్టుకునేలా "పీజే జ్యువెలర్స్" మంచి పేరు సంపాదించాలని, దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, పాక్స్ వైస్ చైర్మన్ రవీందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు చింతల దేవేందర్ రెడ్డి, పూజారి వసంత లక్ష్మణ్ గౌడ్, దప్పు కిరణ్, నాయకులు, శ్యామ్, యాదగిరి, నిర్వాహకులు పద్మజ, పవన్ కుమార్, స్వప్న, నవీన్ కుమార్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సదస్సును విజయవంతం చేయండి

- చిలుక శంకర్ ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి

టీ మీడియా,సెప్టెంబర్ 5,రామగుండం ప్రతినిధి :

ఎన్ టి పి సి.టౌన్ షిప్ లో పెద్దపల్లి జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం ఐ ఎఫ్ టి యు ఆధ్వర్యంలో శుక్రవారం ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కాంట్రాక్టు కార్మికుల సంఘం ఐ ఎఫ్ టీ యు జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుక శంకర్ పాల్గొని మాట్లాడుతూ... కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్,స్కీం కార్మికులను పర్మినెంట్ చేయాలని,కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలు అమలు చేయాలని,8.గంటల పని దినాన్ని కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.దేశంలో 24 విద్యుత్ కంపెనీలు ఉన్నాయని వాటిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు హక్కులు సౌకర్యాలు ఉద్యోగ భద్రత ఇతర చట్టబద్ధ హక్కులు అమలు చేయాలన్నారు.అలాగే సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం వెంటనే అమలు చేయాలన్నారు.ఈ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 7న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగు ఐ ఎఫ్ టీ యు రాష్ట్ర సదస్సును అన్ని రంగాల కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పీసీకేఎస్,ఐఎఫ్టియు జిల్లా నాయకులు పుట్ట స్వామి,గుండు రాజయ్య,దుర్గం రవీందర్,ఓ.సుధాకర్,డి నర్సయ్య,డి.సత్యం, చిరంజీవి, రాయమల్లమ్మ, పద్మ,కవిత, ఓదెమ్మ, సంధ్య, శంకరమ్మ, భాగ్య, స్వరూప, సూరమ్మ, కనకమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్కీడ్రాలో వినాయకుడి లడ్డూ

- గెలుచుకున్న మహిళా కానిస్టేబుల్ రజిత

టి మీడియా,సెప్టెంబర్ 5,రామగుండం క్రైమ్:

హైదరాబాద్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.ఈ క్రమంలో గణేష్ మండపాల్లో నిర్వహిస్తున్న లక్కీ డ్రాలు, లడ్డూ వేలంపాటలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. తాజాగా నేతాజీ వెల్ఫేర్ అసోసియేషన్ హైదరాబాద్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో జరిగిన లక్కీ డ్రాలో రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోత్కపల్లి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుల్ రజిత హైదరాబాదుకు గణేష్ బందోబస్తు డ్యూటీ కి వెళ్లడం జరిగింది మహిళా కానిస్టేబుల్ రజిత అదృష్టవంతురాలిగా నిలిచి,వినాయకుడి లడ్డును గెలుచుకున్నారు. గురువారం రాత్రి జరిగిన డ్రాలో తన పేరు రావడంతో ఆమె ఆనందాన్ని వ్యక్తం చేశారు.శుక్రవారం మండప నిర్వాహకులు లడ్డును అధికారికంగా మహిళా కానిస్టేబుల్ రజితకు అందజేశారు.ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుల్ రజిత మాట్లాడుతూ వినాయకుడి లడ్డూ గెలుచుకోవడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను. విధి నిర్వహణలో ఎంత బిజీగా ఉన్నా, ఇలాంటి పండుగలు మనకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి," అని రజిత తెలిపారు. అలాగే, తాను గెలుచుకున్న లడ్డూను కుటుంబ సభ్యులు, స్నేహితులతో పంచుకుంటానని తెలియజేశారు.మహిళా కానిస్టేబుల్ రజిత విజయం పట్ల మండప నిర్వాహకులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఇలాంటి కార్యక్రమాలు ప్రజలకు మరింత ఆనందాన్ని పంచుతున్నాయి.

గణేష్ లడ్డూని దక్కించుకున్న ముస్లింలు

టీ మీడియా , సెప్టెంబర్ 5,కాసిపేట :

మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో శుక్రవారం వినాయక మండపాల వద్ద నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలో పాట పాడి ముస్లిం సోదరులు లడ్డూలను వేలం పాటలో దక్కించకున్నారు. దేవాపూర్ పాత అంగడిబజార్ వద్దలోని బాల గణేష్ మండపం వద్ద ఎండీ షజీర్ రూ.8,500లకు దక్కించుకోగా స్వచ్ఛందంగా రూ.10,000 ప్రకటించారు. మరో మండపం వద్ద ఎండీ ఇమ్రాన్ రూ.6,500లకు వేలం పాట పాడి లడ్డూను దక్కించుకోగా స్వచ్ఛందంగా రూ.8000 ఇస్తామని ప్రకటించారు. ఇక్కడ ఇంకో ప్రత్యేక ఉంది. వినాయక కొలువు దీరిన సమయంలో ఇక్కడ లడ్డూని ఎండీ ఖదీర్ 6 కిలోల లడ్డూను తయారు చేయించారు. మరో చోట షజీర్ 5 కిలోల లడ్డూ చేయించారు. గణేష్ దేవుడిని అంటే మాకు ఇష్టమని, నమ్మకం ఉందని, ఇక్కడ ముస్లిం, హిందువులు అన్నదమ్ముల్లా కలిసి ఉంటామని వారు స్పష్టం చేశారు.

నిమజ్జనాన్ని శాంతియుతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ రాహుల్ రాజ్

టీ మీడియా , సెప్టెంబర్ 5,మెదక్ :

వినాయక నవరాత్రుల అనంతరం శోభయాత్ర నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని ప్రజలందరూ సమన్వయంతో శాంతియుతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ సూచించారు. గురువారం మెదక్ మండలం కొంటూర్ వద్ద వినాయక నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన కమాట్లాడుతూ గణేష్ ఉత్సవ కమిటీల సహకారంతో క్రమశిక్షణను పాటిస్తూ 9 రోజులపాటు జిల్లాలో గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా జరుపుకున్నారని, గణేష్ శోభాయాత్రతో పాటు, నిమజ్జనాన్ని కూడా ఇదేవిధంగా కొనసాగించాలని కోరారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గణేష్ శోభాయాత్ర కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో రూట్ మ్యాప్ రూపొందించామన్నారు. గణేష్ నిమజ్జనం ఊరేగింపులోని నిమజ్జన ప్రదేశాల్లో ప్రత్యేకించి యువకులు ఎక్కడా అత్యుత్సాహం ప్రదర్శించవద్దని కోరారు. ప్రతి ఒక్కరు చెడు అలవాట్లను మానుకొని మన పూర్వీకులు ఇచ్చిన ఆదర్శాలు, సందేశాల స్ఫురణతో నిమజ్జనంలో పాల్గొనాలని, ఒక సంకల్ప దీక్షతో అభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ హీటర్ ముట్టుకొని బాలుడు మృతి

టీ మీడియా , సెప్టెంబర్ 5,రాయపోల్ :

వాటర్ హీటర్ ముట్టుకొని ఓ బాలుడు మృతి చెందిన విషాదకర సంఘటన సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం పరిధిలోని మాచిన్ పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దొమ్మాట గ్రామానికి చెందిన గడ్డమీది కరుణాకర్‌కు మండల పరిధిలోని మాచిన్ పల్లి గ్రామానికి చెందిన కీర్తనతో 7 ఏళ్ల క్రితం వివాహం అయ్యింది. దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కరుణాకర్, కీర్తన దంపతులు అత్తగారి ఇంటి వద్ద కొన్ని రోజుల నుంచి మాచిన్ పల్లిలో ఉంటున్నారు. కరుణాకర్ ఓ కంపెనీలోపనిచేస్తున్నాడు.కర్ణాకర్ భార్య, కీర్తన ఇంటి వద్ద కిరాణా షాపును నడుపుతున్నది. గురువారం సాయంత్రం ఇంటి వద్ద వాటర్ హీటర్ పెట్టారు. అయితే చిన్న కుమారుడు నోయల్ (4) ఆడుకుంటూ ఆడుకుంటూ వెళ్లి వాటర్ హీటర్ కు తగిలి మృతి చెందాడు. బాలుడు మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. అప్పటివరకు తల్లితో ఆటాడుకున్న చిన్నారి మృతి చెందడంతో మాచినపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

గంగమ్మ ఒడిలోకి బయలుదేరిన గణనాథుడు

టీ మీడియా, సెప్టెంబర్ 5, రామకృష్ణాపూర్:

క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ లోని గణేష్ నవరాత్రులు ముగించుకొని శుక్రవారం గంగమ్మ ఒడిలోకి గణనాథులు బయలుదేరాయి. నిమర్జనం లో భాగంగా భగత్ సింగ్ నగర్ లోని స్నేహ గణేష్ మండలి క్వాటర్స్ ఏరియాలోని గణనాథునికి మహిళలు మంగళ హారతులతో,కోలాటాలతో నృత్యాలు చేస్తూ నది తీరానికి సాగనంపారు.అలాగే రాజీవ్ చౌక్ లో ఏర్పాటు చేసిన గణేష్ శోభాయాత్రలో భాగంగా బెల్లంపల్లి ఏసిపి రవికుమార్,పుర కమిషనర్ రాజు మాట్లాడుతూ ఈ నవరాత్రులు ఏ విధంగానైతే అందరూ సోదర భావంతో కలిసి మెలిసి ఉన్నారో అదేవిధంగా ఇకపై కూడా ఉంటూ సమాజాభివృద్ధిలో పాలు పంచుకోవాలని కోరడం జరిగింది.అలాగే ప్రతి వీధి నుండి గణనాథులు అన్ని బయలుదేరి ఒకే చోట కలిసి శోభ యాత్రలో పాల్గొని, నది తీరానికి బయలుదేరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి,ఆర్కెపి ఎస్సై రాజశేఖర్, పట్టణ రాజకీయ నాయకులు అందరూ, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

గణపతి పూజలో పాల్గొన్నకూన శ్రీశైలం గౌడ్

టీ మీడియా, సెప్టెంబర్ 5,మేడ్చల్:

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని 128 డివిజన్ వల్లభాయ్ పటేల్ నగర్ కాలనీవాసుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ గణపతి పూజలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొని గణనాథుడికి ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం వల్లభాయ్ పటేల్ నగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యేకి శాలువాతో సత్కారించి.చిరు జ్ఞాపకాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో 128 డివిజన్ ప్రెసిడెంట్ పండరి, రామిరెడ్డి, రాము, మనోహర్, ప్రతాపరెడ్డి, మాణిక్య రెడ్డి, యాదగిరి, రామకృష్ణతో పాల్గొన్నారు.

శ్రీ సిద్ధి వినాయక కమిటీ భరతనాట్య కార్యక్రమం

టీ మీడియా, సెప్టెంబర్ 5, మేడ్చల్:

దుండిగల్ మున్సిపాలిటీ చర్చి గాగి లాపూర్ 28వ వార్డులో గణేష్ ఉత్సవాల్లో భాగంగా శ్రీ సిద్ధి వినాయక కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం రోజు సాయంత్రం 8 గంటలకు భరతనాట్య కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా మాజీ కౌన్సిలర్ జోస్పిన్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో భరతనాట్యం లో పాల్గొన్న పిల్లలకి శాలువాలతో సత్కరించి బహుమతులు అందజేశారు. వీరి తోపాటు సిద్ధి వినాయక కమిటీ సభ్యులు, భక్తులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు నూతన విద్యావిధానం

(మొదటిపేజీ తరువాయి...) : రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. ప్రభుత్వం, టీచర్ల చొరవతో కొత్తగా 3 లక్షల మంది విద్యార్థులు కొత్తగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని కొనియాడారు. ప్రైవేట్ స్కూళ్ల టీచర్ల కంటే ప్రభుత్వ టీచర్లకు నైపుణ్యం అధికంగా ఉంటుందని పేర్కొన్నారు. అత్యంత వివాదాస్పదమైన విద్యాశాఖను తీసుకోవద్దని తనకు కొందరు సూచించారన్న సీఎం అయినా సరే స్వయంగా పర్యవేక్షిస్తూ ప్రతిసమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.

ఖైరతాబాద్? గణపతిని దర్శించుకున్న సీఎం : అంతకు ముందు సీఎం ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన రేవంత్?రెడ్డి తీర్థప్రసాదాలను స్వీకరించారు. 71 ఏళ్ల క్రితం గణేశ్ ఉత్సవ సమితి ఒకే ఒక్క అడుగు గణపతిని ప్రతిష్ఠించుకుని ఉత్సవాలను ప్రారంభించిందని, దేశంలోనే గణేశ్ ఉత్సవాలకు హైదరాబాద్?లోని ఖైరతాబాద్ ప్రసిద్ధి చెందిందని సీఎం అన్నారు.

ఒక్కసారి నిర్వహణే కష్టమైన ఈ రోజుల్లో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని తట్టుకుంటూ ఖైరతాబాద్ గణేశ్ ఉత్సవ సమితి ఉత్సవాలను విజయవంతంగా కొనసాగిస్తోందని, గతంలో పీసీసీ అధ్యక్షుడిగా, ఇప్పుడు సీఎంగా ఈ ఉత్సవాల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని రేవంత్? రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో గణేశ్ మండపాలకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందించిందని, ప్రజాప్రతినిధులు, అధికారుల సహకారంతో ఎక్కడా సమస్యలు లేకుండా ఉత్సవాలను పూర్తిచేసుకున్నామన్నారు. ఉత్సవాలను విజయవంతంగా ముగించిన గణేశ్ ఉత్సవ సమితి సభ్యులను అభినందించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున ఉత్సవ సమితికి అన్ని విధాలుగా సహకారం అందిస్తామని అని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

కోటి మందిని చంపుతాం

(మొదటిపేజీ తరువాయి...) : గుర్తిస్తే, వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని ముంబయి పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గణేశ్ ఉత్సవాల వేళ- బాంబు బెదిరింపులు : ముంబయిలో ఏటా అత్యంత వైభవోపేతంగా గణేశ్